క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఓనం వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఓనం వేడుకలను శుక్రవారం అయ్యప్ప సేవా సమాజ్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కల్లూరి రామ లింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో గురుస్వామి, లక్ష్మయ్య, బద్రిశెట్టి శ్రీనివాస్, మల్లికార్జున, సుమశ్రీ రవి, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

కాళికాంబాదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబా దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా గాజులు, పట్టువస్త్రాలతో అలంకరించారు. ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం శ్రీకాళిమాత సేవా సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ఆలయంలో పల్లకీ సేవ నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆరవేటి వాసు, ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్ర, సుబ్బాచారి, విజయ్ కుమార్, లక్ష్మీదేవి, నరసింహ పాల్గొన్నారు.

26 మంది ఉల్లి వ్యాపారుల లైసెన్స్ రద్దు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ఉల్లిగడ్డల కొనుగోలు లైసెన్స్‌లు పొంది కీలకమైన సమయంలో కొనుగోలు చేయకుండా ధరల పతనానికి కారణమైన వ్యాపారుల లైసెన్స్‌లను సస్పెండ్ చేస్తూ చైర్మన్ గోల్కొండ అఖ్మతీబీ ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ నుంచి 36 మంది వ్యాపారులు ఉల్లిగడ్డల కొనుగోలుకు లైసెన్స్‌లు పొందారు. ఆగస్టు నెలలో మార్కెట్‌కు వచ్చిన ఉల్లిగడ్డలను 26 మంది వ్యాపారులు కొనుగోలు చేయలేదు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ తగ్గిపోవడం వల్ల ధరలు పడిపోయాయి. ఈ వ్యవహారంపై మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఉల్లి కొనుగోలు చేయని 26 మంది వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేశారు.

మహిళ మృతదేహం వెలికితీత


గుర్తు తెలియని మహిళ మృతదేహం

కర్నూలు: కేసీ కెనాల్‌లో కొట్టుకుపోతున్న మహిళ మృతదేహాన్ని స్థానికుల సాయంతో పోలీసులు వెలికితీసి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రంలో భద్రపరిచారు. కెనాల్ పైభాగం నుంచి మృతదేహం నీటిలో కొట్టుకుపోతుండగా గణేష్ నగర్ శివాలయం వద్ద స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని కాలువ నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపరిచారు. సుమారు 40 ఏళ్ల వయస్సు ఉండి 4.5 అడుగుల ఎత్తు, నల్లని వెంట్రుకలు ఉన్నాయి. పసుపు రంగు చీర, ఆకుపచ్చ కలర్ జాకెట్ ధరించింది. ఆచూకీ తెలిసినవారు 94404 20901 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఏఎస్ఐ ఓబులేసు కోరారు.

ప్రాణం తీసిన ఈత సరదా

డోన్ టౌన్: ఈత కొట్టేందుకు మైనింగ్ గుంతలోకి దిగిన బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని కన్నపకుంట గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. మూడేళ్ల క్రితం మూతబడిన ఓ గనిలోని గుంతలో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. శుక్రవారం సెలవు కావడంతో గ్రామానికి చెందిన చరణ్(14) సరదాగా ఈత కొట్టేందుకు అందులో దిగాడు. లోతు ఉండడంతో మునిగిపోయాడు. గమనించిన తోటి వారు గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో బయటకు తీసి డోన్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలుడి తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మమత తెలిపారు.

రేపు చౌడేశ్వరిదేవి ఆలయం మూసివేత

బనగానపల్లె రూరల్: ఈ నెల 7వ తేదీ సంపూర్ణ సూర్యగ్రహణం కారణంగా నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 8వ తేదీ ఉదయం 7 గంటల వరకు మూసి ఉంచుతామని చెప్పారు. ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, నిత్యపూజ అనంతరం భక్తులకు దర్శనం యథావిధిగా ఉంటుందని తెలిపారు.


చాగలమర్రిలోని ఆసారే షరీఫ్‌లో ప్రవక్త మహమ్మద్ రసూల్ అల్లా తలనీలాలు ప్రదర్శిస్తున్న హజ్రత్ లాలామియ్యా షా ఖాద్రీ


మహమ్మద్ ప్రవక్త ధరించిన వస్తువులను దర్శించుకుంటున్న ముస్లింలు,


అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన దృశ్యం

ఘనంగా మిలాద్-ఉన్-నబీ




మిలాద్-ఉన్-నబీని పురస్కరించుకొని చాగలమర్రి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, నంద్యాల పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో మతపెద్దలు, యువకులు

చాగలమర్రి: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలను శుక్రవారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ర్యాలీలు నిర్వహించి సర్వ మానవాళికి ప్రవక్త శాంతి సందేశం ఇచ్చారని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రం చాగలమర్రిలో ×నౌ జవానే-అహెలే సున్నత్‌ె ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. సాయంత్రం స్థానిక న్యూ బిల్డింగ్ కాలనీ సమీపంలో వెలసిన శ్రీబందేషావలి దర్గా నుంచి పెద్ద మకానం మీదుగా గాంధీ సెంటర్, మెయిన్ బజార్ నుంచి చిన్నమకానం వీధి మీదుగా జామీయా మస్జీద్ పక్కనే వెలసిన ఆసారే షరీఫ్ (మహమ్మద్ ప్రవక్త తల నీలాలను భద్రపరిచిన గది) వరకు ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి, భక్తులందరికి తబర్రుకాత్ పంచి పెట్టారు. అనంతరం ప్రవక్త తల నీలాలను నిర్వాహకులు సయ్యద్ లాలా మియ్యా షా ఖాద్రీ ప్రదర్శించారు. దాత ప్యారేభాయిగారి మాబు షరీఫ్ అసారే షరీఫ్ వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖాజీ ఖమురుద్దీన్, గౌస్, ×నౌ జవానే-అహెలే సున్నత్‌ె సభ్యులు అబ్దుల్ ఖాదర్, గాడి మహబుబ్ షరీఫ్, కె.బాష, హనీఫ్, నూరి తదితరులు పాల్గొన్నారు.

● నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చాంద్‌బాడాలో సాహెబ్ మసీదులో ఆసారెముబారక్ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త తలవెంట్రుకలు, ఆయన ధరించిన కంబలి తదితరవి ప్రదర్శించారు. వాటిని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకొని సర్వ మానవాళి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మంజుబాషా దర్గా నిర్వాకుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మతపెద్దలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త అనుసరణీయమని చెప్పారు. కార్యక్రమంలో మతగురువులు సయ్యద్ షర్ఫుద్దీన్, హుసేనీ సయ్యద్, అసదుల్లా, సయ్యద్ కరీముల్లా, హుసేన్, మొయిద్దీన్ హుసేనీ పాల్గొన్నారు.

ఆల్ మదద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని ఆల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీం ఆధ్వర్యంలో జీఎస్ఆర్ ఆసుపత్రి సహకారంతో నందమూరినగర్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి డాక్టర్ మహమ్మద్ రఫీ, డాక్టర్ ఆరీఫాబానులు పాల్గొని 200 మందికి ఉచిత వైద్యం, మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆల్ మదద్ కంప్యూటర్ సెంటర్ నిర్వాహకులు రహంతుల్లా, సభ్యులు నబీ రసూల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడకండి అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు గుండెపోటుతో మృతి


విజయప్రతాప్‌రెడ్డి(ఫైల్)


ప్రతాప్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఉయ్యాలవాడ : గుండెపోటుతో మృతి చెందిన గ్రామ వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు రామదాస్‌గారి కసాని విజయప్రతాప్‌రెడ్డి(49) కుటుంబానికి అండగా ఉంటామని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామ మాజీ సర్పంచ్ కసాని నారాయణమ్మ కుమారుడు వైఎస్ఆర్‌సీపీ నాయకుడు విజయప్రతాప్‌రెడ్డి గురువారం పొలానికి వెళ్లి ఇంటికి వచ్చి కాసేపు విశ్రాంతి తీసుకుందామని నిద్రకు ఉపక్రమించాడు. భార్య శాంతి భోజనం చేసేందుకు ప్రతాప్‌రెడ్డిని లేపగా పలకలేదు. శరీరం అంతా చల్లబడడంతో భయాందోళనకు గురై ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల శుక్రవారం గ్రామానికి చేరుకుని ప్రతాప్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి(పెద్దమ్మ) భావోద్వేగానికి లోను కావడంతో మాజీ ఎమ్మెల్యే కంట తడి పెడుతూ ఆమెను ఓదార్చారు. తన పెద్దనాన్న గంగుల ప్రతాప్‌రెడ్డి రాజకీయ ప్రవేశం చేసినప్పటి నుంచి మా కుటుంబంతో నడిచిన కుటుంబమని గుర్తు చేసుకున్నారు. ఏ ఎన్నికలు ఎప్పుడు వచ్చిన గంగుల కుటుంబ విజయం కోసం ఎంతో కష్టపడే వారన్నారు. విజయప్రతాప్‌రెడ్డి లేని లోటు మండలంలో పార్టీకి తీరని లోటన్నారు. ఈయన వెంట మండల వైఎస్ఆర్‌సీపీ ఉపాధ్యక్షుడు గజ్జెల క్రిష్టారెడ్డి, నాయకులు కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఆరికట్ల శివరామక్రిష్టారెడ్డి, కసాని రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు విజయప్రతాప్‌రెడ్డి మృతికి ప్రగాడ సానుభూతి తెలిపారు.

గుండెవ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గోస్పాడు: గుండె వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కిమ్స్ ఆసుపత్రి గుండె వైద్యులు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. నంద్యాల పట్టణంలోని నబీనగర్ ఓల్డ్ టౌన్ ప్రాంతంలో ఇఖ్రా స్కూల్‌లో మిలాద్ వున్ నబీ వేడుకలు సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి కర్నూలు వారి ఆధ్వర్యంలో శుక్రవారం గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గుండె జబ్బుతో బాధపడుతున్న వారు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ నాయకులు ఫిరోజ్, కౌన్సిలర్ ఆరీఫ్ నాయక్, సాధిక్, మైనార్టీ సంఘాల నాయకులు మహబాషా, జుబేర్, సమీర్, అడ్వకేట్ సోహెల్‌రాజా, హారీస్‌బాషా, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం క్రతువు నిర్వహిస్తున్న ఉభయదారులు, వేదపండితులు

చాగలమర్రి: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రమైన శ్రావణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం ఉభయదారులు కామిశెట్టి ప్రసాద్, ప్రమీల దంపతులు స్వామికి పూజలు చేసి కళ్యాణం జరిపించారు. అర్చకులు దుర్భాక అనిల్ కుమార్, లోకేష్ శర్మలు కల్యాణ క్రతువుల్లో భాగంగా ఉదయం గణపతిపూజ, పున్యాహవాచనం, కంకణపూజ, కంకణ ధారణ, యజ్ఞోపవిత ధారణ, మధుపర్క సమర్పణ, పాద ప్రక్షాళన, మాంగళ్యపూజ, పట్టు వస్త్రాల సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత అశేష భక్తజనం మధ్య స్వామి కల్యాణం నిర్వహించి పల్లకీలో ఊరేగించారు. భక్తుల సౌకర్యార్థం ఉభయదారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్న ఓబుల్‌రెడ్డి మహేశ్వరరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కమిశెట్టి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థాన అర్చకులు ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.



తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లాకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుడు షేక్ మహబూబ్ సాహెబ్‌ను సన్మానించారు. వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, పర్వతరెడ్డి, చంద్రశేఖరరెడ్డి తదితరులు ఆయనకు శాలువ కప్పి మెమొంటో అందజేశారు.

అమెరికా సుంకాలపై నిరసన

నంద్యాల(న్యూటౌన్): మనదేశ ఉత్పత్తులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలను నిరసిస్తూ నేడు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వామపక్ష నాయకులు ప్రసాద్, లక్ష్మణ్, మహమ్మద్ గౌస్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆందోళన కార్యక్రమంలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు శంకర్, రామరాజు, వెంకటలింగం, సోమన్న, నాగరాముడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

శిరివెళ్ల: మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపామని ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి శిరివెళ్ల మెట్ట నుంచి గోస్పాడు వరకు గల రోడ్డుకు రూ. 5 కోట్లు, శిరివెళ్ల నుంచి చిన్న కంబలూరు మెట్ట వరకు ఉన్న రోడ్డుకు రూ. 3 కోట్లతో ప్రతి పాదనలు పంపామన్నారు. నిధులు మంజూరు కాగానే టెండర్ పిలిచి త్వరగా రోడ్ల నిర్మాణాలు చేపడుతామన్నారు.

8 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

శిరివెళ్ల: మండలంలో 8 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వచ్చాయని ఎంఈఓలు శంకరప్రసాదు, నాగార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉదయ్ ప్రేమ్ కుమార్, పద్మావతి, షేక్షావలికి వచ్చాయన్నారు. కేజీబీలో ముల్లా షహనాబీ, రాజనగరం ఉన్నత పాఠశాలలో తిరుపతిరెడ్డి, యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల చింతలయ్య, అంజయ్య చౌదరి, గోవిందపల్లె ఉన్నత పాఠశాలలో శ్రీధర్‌కు అవార్డులొచ్చాయన్నారు. నంద్యాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ సభలో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు భక్తులకు గాయాలు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు భక్తులు గాయపడ్డ సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎగువ అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని దిగువ అహోబిలం వచ్చేందుకు భక్తులు ఆటో ఎక్కారు. ఓం నమోనారాయణ మలుపు సమీపంలోకి వచ్చేసరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అహోబిలం గ్రామానికి చెందిన వడ్ల రాజ్యలక్ష్మితో పాటో మరో ముగ్గురు గాయపడ్డారు. గాయపడ్డ వారిని ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

7న కొత్తూరు ఆలయం మూసివేత

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ఈనెల 7న మూసివేస్తున్నట్లు ఈఓ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు మూసివేసి సోమవారం ఉదయం 5 గంటలకు తిరిగి తెరుస్తామని వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గ్రహించాలన్నారు.

డీఈఓకు సన్మానం


నంద్యాలలో డీఈఓను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్‌రెడ్డిని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు శుక్రవారం ఆయన కార్యాలయ ఆవరణలో ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యాయులకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధిక సంఖ్యలో ఉత్తమ అవార్డులు అందించడం సంతోషకరమన్నారు కార్యక్రమంలో జిల్లా నాయకులు మద్దయ్య, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల పబ్లిక్ స్కూల్‌లో..

పట్టణంలోని శ్రీశైలం పబ్లిక్ స్కూల్, భారతీ బీఈడీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచాబ్రహ్మనందరెడ్డి, డాక్టర్ కె.రవీంద్రనాథ్, డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి మురళీకృష్ణారావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు నబీసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రాయల్ పాఠశాలలో..

పట్టణంలోని నబీ నగర్‌లో ఉన్న రాయల్ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవం పాఠశాల కరస్పాండెంట్ ఇసాక్‌వలి మాట్లాడుతూ రాధాకృష్ణ ఉపాధ్యాయులకు ఆదర్శమన్నారు.


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు


శిరివెళ్లలో ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

నంద్యాల(వ్యవసాయం): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో రిటైర్డు ఉపాధ్యాయులకు ఘనంగా సత్కరించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, సురేష్, రామసుబ్బారెడ్డి, తులసి నారాయణమూర్తిలను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రవికృష్ణ, నాగరాజు, శ్రీకాంత్, భాస్కరరెడ్డి, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: మండలంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతిని విద్యార్థులు, అధ్యాపకులు సన్మానించారు. అంతకు ముందు డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

గురువులు మార్గదర్శకులు


చాగలమర్రి: విశ్రాంత ఉపాధ్యాయులతో ఏడీ వరప్రసాద్

చాగలమర్రి: విద్యార్థుల భవిష్యత్తుకు గురువులు మార్గదర్శకులని చాగలమర్రి ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు వరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన గురుపూజ దినోత్సవం సందర్భంగా స్థానిక పశువైద్యశాలలో 1971 వ సంవత్సరం నుంచి విద్యను బోధించిన విశ్రాంత ఉపాధ్యాయులు ఓబయ్య, పురోషోత్తం, నరసింహారెడ్డి, పీఈటీ బాలమునయ్యతో పాటు ఉపాధ్యాయుడు విజయరాజును దుశ్శాలువ, పూలమాల వేసి సన్మానించారు. అనంతరం సన్మానితులైన విశ్రాంత ఉపాధ్యాయులు మాట్లాడుతూ గురువులు ఎల్లప్పుడు తమ శిష్యుల ఎదుగుదలను కోరుకుంటారన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మహబూబ్‌బాషా, శంకరమ్మ, నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి కూటమి ఉరితాడు


డాక్టర్ శశికళారెడ్డి

బొమ్మలసత్రం: పేదలకు విలువైన కార్పొరేట్ వైద్యాన్ని ఉచింతంగా అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి కూటమి ప్రభుత్వం ఉరితాడు బిగిస్తోందని ఏపీఎస్పీడీసీఎల్ మాజీ డైరెక్టర్ శశికళారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పిల్లల కోసం కొత్తగా 17 మెడికల్ కళాశాలలు నిర్మాణానికి పూనుకున్నారన్నారు. ఆయన పాలనలోనే 10 మెడికల్ కళాశాలల పనులు పూర్తి అయ్యాయన్నారు. కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత మెడికల్ కాలేజీలపై దృష్టి సారించకపోగా రాష్ట్రానికి అదనంగా మెడికల్ సీట్లు అవసరం లేదని కేంద్రానికి చెప్పి మెడికల్ విద్యను దూరం చేసిందన్నారు. త్వరలో 10 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు 63 ఏళ్ల పాటు లీజ్‌కు ఇచ్చేందుకు చంద్రబాబు సర్కారు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు చేయకపోవడం ద్వారా పేదలు ఇక నుంచి ఉచిత వైద్యం పొందేందుకు బీమా కంపెనీల చుట్టు తిరగాల్సి రానుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గతంలో రూ. 25 లక్షల వరకు ఖర్చు అయ్యే వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారానే పొందేలా చేశారని, ఇప్పుడు కూటమి సర్కారు ఈ పథకాన్ని ప్రైవేట్‌కు అప్పగించడం సరికాదన్నారు.

ఓ వ్యక్తిపై నలుగురు దాడి

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

నంద్యాల:నలుగురు వ్యక్తులు ఓ వ్యక్తిని బంధించి దారుణంగా కొట్టారు. ఈ ఘటన ఎప్పుడు జరిగిందో తెలియదు కానీ ప్రస్తుతం దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. దీనిపై నంద్యాల టూటౌన్ సీఐ అస్రార్ బాషా శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టెక్కె మార్కెట్‌యార్డు ప్రాంతంలో వ్యక్తిపై దాడి చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుందని, ఈ వీడియో ఇప్పటిది కాదని, 8 నెలల క్రితం జరిగిందన్నారు. టెక్కె ప్రాంతంలో పండ్ల వ్యాపారం చేసుకునే కొంత మంది ఓ వ్యక్తిని గదిలో బంధించి కర్రలతో, కాళ్లతో కొట్టారన్నారు. బాధితుడిని కొట్టిన రూము వద్దకు వెళ్లి విచారించగా అక్కడ ఎవరూ లేరన్నారు. వడ్డీ వ్యాపారులు దాడి చేశారా.. లేక పండ్ల వ్యాపారులు దాడి చేశారా.. అన్నది విచారణలో తెలుస్తుందన్నారు. ఇప్పటి వరకు ఈ విషయంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు దారులు ముందుకు రాకపోతే వీడియోను సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.